
@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || శనివారం 30, మార్చి 2024 || పేజీలు: 04

## మెదక్ చర్చిలో
# గుడ్‌ఫ్రైడే వేడుకలు



**నేటి ఫోకస్ న్యూస్, మెదక్-మార్చి29:**
ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడేసందర్భంగా వేలాది మంది భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు శిలువను ఊరేగించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రార్థనలు జరిగాయి. ప్రత్యేక ప్రార్థనల మధ్య భక్తులు గురువుల మిగతా 2లో..

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో
# కీలక పరిణామం
### మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు 14రోజుల రిమాండ్



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి29:**
ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు అధికారులను అరెస్ట్ చేయగా.. తాజాగా అరెస్టైన మాజీ డీసీపీ రాధాకిషన్ రావుకు నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా, మిగతా 2లో..

## సీఎం రేవంత్‌తో
# కేకే భేటీ..
### కాంగ్రెస్ పార్టీలో చేరికపై ఇరు నేతల చర్చ..
### తన పుట్టిల్లు కాంగ్రెస్సే.. అంటూ కేకే వ్యాఖ్యలు..



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి29:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు భేటీ అయ్యారు. డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి సీఎం నివాసానికి వెళ్లిన కేకే.. ముఖ్యమంత్రితో పార్టీ చేరికకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలుస్తున్నది. తాను బీఆర్ఎస్ నుంచి సొంతగూటికి చేరుతున్నట్లు కెకె ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. ఆయన కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి కూడా కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ఇటీవల వారితో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి తిరిగిరావాలని ఆహ్వానించారని చెప్పారు. దీంతో 84 ఏండ్ల వయసులో తిరిగి సొంత ఇంటికి వెళ్లాలన్న ఆలోచన తనకు కూడా కలిగిందని కేకే అన్నారు. బీఆర్ఎస్‌లో తనకు సముచిత గౌరవం దక్కిందని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ తనకు గౌరవం ఇచ్చారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా తనను బాగా చూసుకున్నారని అన్నారు. తాను, తన కుమార్తె, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి మిగతా 2లో..



## కాళ్లు పట్టుకున్నా..
# పార్టీలోకి రానివ్వం

- పట్నం దంపతులు, రంజిత్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారు
- కేకే, కడియం పెద్దవారు.. విమర్శలు విజ్ఞతకే వదిలేద్దాం
- పార్టీ వీడితే కాలమే సమాధానం చెబుతుంది

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి 29:**
'రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదు. కానీ అధికారం పోగానే స్వార్థం కోసం కొందరు నేతలు పార్టీలు మారుతున్నారు. రేపు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి వంటి వారు వచ్చి కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానిచ్చేది లేదు. పదేళ్లు అధికారం అనుభవించిన నాయకులు పార్టీ నుంచి బయటకు వెళ్లే ముందు రెండు రాళ్లు వేసి వెళతారు. కేకే, కడియం శ్రీహరి వయస్సురీత్యా పెద్దవారు.. వారినేమీ అనలేం..విజ్ఞతకే వదిలేద్దాం..కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుంది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మిగతా 2లో..

## సీఎం రేవంత్‌వి
# బెదిరింపు రాజకీయాలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, షాద్‌నగర్-మార్చి 29:**
**కాంగ్రెస్ పార్టీలో** చేరకపోతే అక్రమ దందా వ్యవహారాలు బయటపెడతామంటూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శుక్రవారం పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ మిగతా 2లో..





# కేసీఆర్ పాపాల వల్లే రాష్ట్రంలో కరవు

- యాదగిరిగుట్ట పేరు మార్చడమే మొదటి తప్పు
- దేవుడిపేరుతో అక్రమాలు, అవినీతికి తెగించారు
- కాళేశ్వరంలోనూ అక్రమాలు అనేకం
- ఫోన్ ట్యాపింగ్ ఏ రాష్ట్రంలోనూ లేదు
- మంత్రి కోమటిరెడ్డి ఘాటు విమర్శలు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి29:**
బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ గతంలో చేసిన పాపాలే.. ప్రస్తుతం ఆయన్ని చుట్టుముడుతున్నాయని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో చిట్ చాట్‌గా మాట్లాడారు. గతంలో కేసీఆర్ పాలనను మిగతా 2లో..

## డిజిటల్ టెక్నాలజీకి
# పెద్దపీట

- మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో 'చాయ్ పే చర్చ'
- కృత్రిమ మేధ దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది
- డిజిటల్ విప్లవానికి ప్రజలే సారథులు కావాలన్న మోదీ



**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-మార్చి 29:**
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై తనకెంతో ఆసక్తి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. టెక్నాలజీలో తాను నిపుణుడిని కాకపోయినా దానిపై చిన్నపిల్లలకు ఉండే ఉత్సుకత తనకు కూడా ఉందని తెలిపారు. అదే సమయంలో టెక్నాలజీకి తాను బానిస కాలేదని వివరించారు. ప్రధాని మోదీ మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌తో ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శుక్రవారం 'చాయ్ పే చర్చ' నిర్వహించారు. మిగతా 2లో..



## పసిడి సరికొత్త
# రికార్డు

- ఒక్కరోజే రూ.1,420 పెరుగుదల, తులం రూ.68,730
- అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు 2,250 డాలర్ల ఎగువకు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి 29:**
బంగారం మళ్లీ కొండెక్కుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ఒక్క రోజే రూ.1,420 పెరిగి రూ.68,730కి చేరుకుంది. ధర రూ.68,000 దాటడం ఇదే తొలిసారి. 22 క్యారెట్ల బంగారం సైతం రూ.1,300 పెరిగి రూ.63,000 కు ఎగబాకింది. కిలో వెండి రూ.80, 800 పలికింది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధర పెరగడమే ఇందుకు ప్రధాన మిగతా 2లో..

## ఆకుల రాలే
# కాలం ఇది

- పనికరాని ఆకులు చెత్తలో పడుతున్నాయి
- కష్టకాలంలో ఉంటే ద్రోహం చేసి వెళుతున్నారు
- పార్టీ వీడిన వారు కాళ్లు మొక్కినా వెనక్కి తీసుకోం
- పార్టీని వీడుతున్న వారిపై మండిపడ్డ హరీష్ రావు

2



# మెదక్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు

(మొదటి పేజీ తరువాయి..)

ఆశీర్వాదాలు పొందారు. శుభ శుక్రవారం ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజు. శిలువకు తనకు తానే లోక పాపములను పోగొట్టుటకు శిలువ ఎక్కాడు. ఆ దినమున పలికిన 7 ప్రవచనాలను భక్తులు ధ్యానం చేయడం ఈ రోజు ప్రత్యేకత. చర్చి ప్రేసీబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవ సందేశం చేశారు. ఏసు శిలువ వేయబడిన తర్వాత తన చివరి ఏడు మాటల గురించి భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఏసయ్య భక్తి గీతాలు ఆలపించారు. గుడ్‌డే సందర్భంగా మెదక్ డయాసిస్ పరిధిలోని పలు జిల్లాల నుంచి క్రైస్తవులు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంతం కిటకిటలాడింది.

# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

(మొదటి పేజీ తరువాయి..)

ఉద్యోగ విరమణ తర్వాత అక్కడే ఓఎస్డీగా సుదీర్ఘకాలం పనిచేసిన రాధాకిషన్ రావును ఫోన్ ట్యాపింగ్ కేసులో అదుపులోకి తీసకోగా.. ఆయనను కొంపల్లిలోని న్యాయమూర్తి నివాసంలో ప్రవేశపెట్టారు. ఆయనకు 14రోజుల రిమాండ్‌ను న్యాయమూర్తి విధించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో పని చేసిన సమయంలో సస్పెండ్‌కు గురైన డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాధాకిషన్‌రావు బృందం అనధికారికంగా ఫోన్లు ట్యాప్ చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి బంజారాహిల్స్ స్టేషన్‌లో రాధాకిషన్‌రావును విచారించిన దర్యాప్తు బృందం శుక్రవారం ఆయనను అరెస్ట్ చూపించింది. దీంతో గాంధీ ఆసుప్రతిలో వైద్య పరీక్షల అనంతరం న్యాయమూర్తి ముందు ఆయనను పోలీసులు ప్రవేశ పెట్టారు. జడ్జి రిమాండ్ విధించడంతో రాధాకిషన్‌రావును చంచల్‌గూడ జైలుకు తరలించారు. మరోవైపు ఈ కేసులో ఇప్పటికే అడిషనల్ ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న అరెస్ట్ కాగా.. వారిద్దరు ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా వారిద్దరికి ఏప్రిల్ 2వరకు కోర్టు పోలీస్ కస్టడీకి అప్పగించింది. ఈ కేసులో కీలకంగా ఉన్న మరో నిందితుడు ప్రణీత్ రావును కస్టడీకి ఇచ్చేందుకు మాత్రం కోర్టు నిరాకరించింది.

# సీఎం రేవంత్‌వి బెదిరింపు రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి..)

చిత్తశుద్ధితో జరగడం లేదన్నారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారులను, కాంట్రాక్టర్లను డొనేషన్ల కోసం ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపానికి రాష్ట్రంలో రాహుల్ గాంధీ ట్యాక్స్‌ను విధిస్తున్నారని నిందించారు. బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పయనిస్తోందని, న్యాయ విచారణ పేరుతో కాళేశ్వరం దర్యాప్తును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టేసిందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

# పసిడి సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి..)

కారణం. ఫెడ్ రేట్ల తగ్గింపు అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఆల్ టైం రికార్డు స్థాయి రూ.2,254 డాలర్లకు పుంజుకుంది. వెండి 25.10 డాలర్ల వద్ద ట్రేడైంది. ఒక్క మార్చి నెలలోనే ఔన్సు బంగారం 9 శాతం పెరిగింది. 2020 జూలై తర్వాత అత్యధిక నెలవారీ వృద్ధి ఇది. అంతేకాదు, వరుసగా రెండు త్రైమాసికాలుగా బంగారం ప్రియమవుతూనే వచ్చింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.60,000 స్థాయిలో ఉన్న తులం బంగారం.. ఈ ఆర్థిక సంవత్సరం చివరికి మరో రూ.8,730 పెరుగుదలతో రూ.68,730కి చేరుకుంది. అంటే పసిడి ఇన్వెస్టర్ల పెట్టుబడి విలువ ఏడాది కాలంలో 14.6 శాతం పెరిగింది. ఫెడ్ రేట్ల తగ్గింపుపై మరింత స్పష్టత వస్తే, బంగారం రేటు మరింత పుంజుకునే అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఏడాది చివరినాటికి వడ్డీరేట్లను 0.75 శాతం మేర తగ్గించే అవకాశాలున్నాయని ఫెడ్ రిజర్వ్ చీఫ్ జెరోమ్ పావెల్ సంకేతాలిచ్చారు. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది.

# కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం

(మొదటి పేజీ తరువాయి..)

చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ కీలక నేతలతో జరిగిన భేటీలో కేటీఆర్ ప్రసంగించారు. 'రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు పార్టీలో నీడలా ఉంటూనే వెన్నుపోటు పొడిచారు. ఆస్కార్ అవార్డుకు మించి నటిస్తే పిచ్చోళ్లలా నమ్మాం. బయటివాడు మోసం చేస్తే బాధ అనిపించదు. కానీ నీడలా తిరిగి, కష్ట కాలంలో వెంట ఉండకుండా కేసీఆర్ కూతురు అరెస్టు అవుతున్న సమయంలో నవ్వుకుంటూ వెళ్లి రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంపై బదలా తీర్చుకోవాలి. రంజిత్‌రెడ్డి చేసిన ద్రోహానికి చేవెళ్ల నాయకులు బుద్ధి చెప్పాలి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రస్తావనకు రాకుండా ఉండేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌ట్యాపింగ్ అంటూ యూట్యూబ్ చానళ్లకు డబ్బులిచ్చి లీకులు ఇస్తున్నాడు. కేసీఆర్‌ను బొందపెడతా అని రోత మాటలు మాట్లాడుతూ చౌకబారు విమర్శలు చేస్తున్నాడు. ప్రజలకు ఇచ్చిన హామీలు ఎగవేసేందుకు రోజుకో స్కామ్ అంటూ ప్రచారం చేస్తూ కేసీఆర్ అధికారం నుంచి దిగి నాలుగు నెలలైనా యూట్యూబ్ చానళ్లను అడ్డుపెట్టుకొని తిట్టిస్తున్నాడు. ఆరు గ్యారంటీలు పోయి ఆరు గారడీలు మాత్రమే రేవంత్ పాలనలో మిగిలాయి. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగి హామీలు నెరవేర్చాలి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖమ్మం, నల్లగొండ నేతలే రేవంత్ ప్రభుత్వానికి మానవబాంబులు అవుతారు. కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో దేశమంతా కలిపి 40 సీట్లు వచ్చే పరిస్థితి లేదు. బీజేపీని నిరోధించే శక్తి ప్రాంతీయ పార్టీల నేతలు మమతాబెనర్జీ, కేసీఆర్, కేజ్రీవాల్, స్టాలిన్ వంటి వారికి మాత్రమే ఉంది'అని కేటీఆర్ అన్నారు.

### కార్యకర్తల కోసం కాలికి బలపం..

'ఇన్ని రోజులు పార్టీ, నాయకుల కోసం పనిచేసిన.. కార్యకర్తల కోసం కాలికి బలపం కట్టుకొని తిరుగుతా. పదిమంది సభ అయినా వేయిమంది సభ అయినా వచ్చి కొట్లాడతా. సైలెంట్‌గా పనిచేస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దాం. నాయకులు పార్టీని వదిలేసినా, శ్రేణుల కోసం స్వయంగా పనిచేస్తా. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకునేందుకు సర్వశక్తులూ కేంద్రీకరిస్తా. ధాన్యం బోనస్ ఇవ్వకుంటే నిప్పు రగిలిద్దాం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండేందుకు వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల నుంచి కేసీఆర్ అభ్యర్థిగా భావించి పనిచేద్దాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# సిఎం రేవంత్ రెడ్డితో కెకె భేటీ

(మొదటి పేజీ తరువాయి..)

కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచనతో ఉన్నామని చెప్పారు. తన కుమారుడు విప్లవ్ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెప్పాడని వెల్లడించారు. కేకే నిన్న బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన విషయం తెలిసిందే. చనిపోయే వరకూ కాంగ్రెస్ లోనే ఉంటానని కేకే తెలిపారు. రేపు ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారు. కేకే కాంగ్రెస్ పార్టీలో చేరనుండటంతో ఒక్కసారిగా రాష్ట్రంలో కలకలం ప్రారంభమైంది. ముందుగా ఆయన కుమార్తె విజయలక్ష్మి కాంగ్రెస్‌లో చేరతారని.. ఆమె చేరిన తర్వాత కేకే పార్టీ మారే అవకాశం ఉందంటూ తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆమె కంటే ముందుగానే రేవంత్‌తో కేకే భేటీ అవడం గమనార్హం. కాంగ్రెస్‌లో చేరడంపై కేశవరావు తాజాగా ప్రకటన చేశారు. కాంగ్రెస్ తనకు సొంత ఇల్లులాంటిదని చెప్పారు. తీర్థయాత్రలకు వెళ్లిన వారు ఎప్పటికైనా ఇంటికే చేరుతారని.. తాను కూడా తన సొంత ఇల్లు కాంగ్రెస్‌లో చేరుతానని స్పష్టం చేశారు. 53ఏళ్లు కాంగ్రెస్‌లో పని చేశానని అన్నారు. బీఆర్ఎస్‌లో తాను పని చేసింది కేవలం పదేళ్లు మాత్రమేనని తెలిపారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్‌లో చేరానని అన్నారు. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ఇచ్చిందన్నారు. తాను మొదటిసారి కాంగ్రెస్ రెండో ప్రాధాన్యత ఓట్లతోనే రాజ్యసభకు ఎన్నికయ్యానని కేశవరావు తేల్చిచెప్పారు. తాను పుట్టింది, పెరిగింది, కాంగ్రెస్‌లోనేనని... ఆ పార్టీలోనే చనిపోవాలని అనుకుంటున్నానని చెప్పారు. తాను బీఆర్ఎస్‌కు ఇంకా రిజైన్ చేయలేదన్నారు. తన కూతురు కాంగ్రెస్‌లో చేరిన రోజు.. తాను ఆ పార్టీలో చేరట్లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరే తేదీ ఖరారు అయిన తర్వాత తానే చెబుతానని అన్నారు. తన కుమారుడు మాత్రం బీఆర్ఎస్‌లోనే ఉండాలని అనుకుంటున్నారన్నారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేశవరావు స్పష్టం చేశారు.

# కేసీఆర్ పాపాల వల్లే రాష్ట్రంలో కరవు

(మొదటి పేజీ తరువాయి..)

ఈ సందర్భంగా ఆయన తూర్పారబెట్టారు. యాదగిరిగుట్ట పేరు మార్చడమే కేసీఆర్ చేసిన మొదటి తప్పు అని ఆయన స్పష్టం చేశారు. దేవుడిపేరుతో అక్రమాలు,అ వినీతికి తెగించారని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన పాపాల వల్లే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే వర్షం.. వర్షం అంటే కాంగ్రెస్ పార్టీ అన్నట్లుగా ఉండేదని... కానీ కేసీఆర్ పాలనలో అలా లేదని చెప్పారు. ఎండిన పంటలను చూస్తుంటే ఏడుపు వస్తోందన్నారు. ఇక దేవుడి పేరు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సర్వనాశనం చేశారంటూ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. మా జిల్లాను నాశనం చేసి మళ్లీ ఏ మొఖం పెట్టుకోని నల్గొండ వస్తారంటూ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారులతో సైతం పాపపు పనులు చేయించారన్నారు. దీంతో ఆ పాపంలో భాగస్వామ్యలైన అధికారులు నిద్రపోవడం లేదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందరికి ఇండ్లు ఇచ్చామని.. అయితే కేసీఆర్ ఎవరికి ఇండ్లు ఇచ్చారో ఎవ్వరికీ తెలియదంటూ కోమటిరెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితబందు, సీఎంఆర్ఎఫ్‌పై కమిషన్లు సైతం దండుకున్నారని గుర్తు చేశారు. అలాగే యాదగిరి గుట్టలో స్కాం జరిగిందని.. దీనిపై లోక్‌సభ ఎన్నికలు పూర్తైన తర్వాత విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. అలాగే యాదాద్రి పేరు మళ్ళీ యాదగిరి గుట్టగా మారుస్తామని.. అయితే ఇది ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేస్తుందన్నారు. కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు రహదారి కోసం ఆ ఊళ్లోని నివాసాలను సైతం కూల్చారని ఆరోపించారు. రూ. 2 వందల కోట్లు ఖర్చు చేస్తే ఆలేరు ప్రాజెక్ట్ పూర్తయ్యేదని.. కానీ కేసీఆర్ ఆ పని చేయలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఏ రాష్ట్రంలో చూడలేదని తెలిపారు. అయితే కేసీఆర్ ఫక్తు రాజకీయ నాయకుడయ్యారని ఈ సందర్భంగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభివర్ణించారు. దాంతో ఆయన ప్రతీది రాజకీయ చేశారని విమర్శించారు. యాదగుట్టలో చేసిన పాపాలే కేసీఆర్‌కు తగిలిందని.. అందుకే బీఆర్ఆర్ పార్టీ ఖాళీ అవుతుందని.. ఆ క్రమంలోనే ఆయన మైండ్ బ్లాంక్ అయి ఏదేదో మాట్లాడుతున్నారంటూ ఎద్దేవా చేశారు.రైతు బంధు 97 శాతం మంది రైతులకు పడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు సంబంధం లేని విషయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లేదని.. అందుకే టికెట్ ఇచ్చినా వద్దు అని ప్రకటిస్తున్నారని చెప్పారు. అయితే మేము గేట్లు తెరవలేదని.. కానీ మా పార్టీ గేట్లు పగలకొట్టి మరీ వచ్చి చేరుతున్నారని తెలిపారు. ఇక బీఆర్ఎస్ పార్టీలో ఒక్కరూ కూడా మిగలరని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా జోస్యం చెప్పారు. కొత్త వాళ్లకు టికెట్ ఇవ్వడమంటే.. గెలిచే వాళ్లకు ఇస్తున్నారని.. అంతేకానీ.. పాత వాళ్లకు అన్యాయం చేయడం లేదని చెప్పారు. హైదరాబాద్ లాంటి లోక్‌సభ స్థానంలో గెలిచే బలమైన అభ్యర్థినే బరిలో నిలుపబోతున్నట్లు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఆకుల రాలే కాలం ఇది

**నేటి ఫోకస్ న్యూస్, సిద్దిపేట-మార్చి29:**

కష్టకాలంలోఉన్న సమయంలో బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న నాయకులపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారని, అలాంటి వారంతా పనికిరాని ఆకుల మాదిరిగా పార్టీని వీడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. దుబ్బాకలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఇవాళ మన పార్టీ నుంచి కొంతమంది నాయకులు బయటకు పోతున్నారు.. కార్యకర్తలు ఎవరూ వెళ్లడం లేదు. ఎవరైతే మధ్యలో మన పార్టీలోకి వచ్చారో.. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారు. ఇప్పుడు ఎవడైతే పార్టీ నుంచి పోయారో.. రేపు కాళ్లు మొక్కినా పార్టీలోకి రానిచ్చేది లేదని పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఎట్టి పరిస్థితుల్లో వారిని పార్టీలోకి రానిచ్చే పరిస్థితి లేదు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్టే. ఇది అన్యాయం కాదా..? ఏం తక్కువ చేసింది పార్టీ వారికి.. అన్ని అవకాశాలు ఇచ్చింది. పార్టీకి అండగా నిలబడ్డ నాయకులను, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇది ఆకులు రాలేకాలం.. ఇప్పుడు అట్లనే మన పార్టీలో నుంచి కొన్ని పనికిరాని ఆకులు చెత్తకుప్పలో కలిసి పోతున్నాయి. ఆకులు పోయాక మళ్లీ కొత్త చిగురు వచ్చి ఆ చెట్టు వికసిస్తుంది. కొన్ని ఆకులు పోయినట్టు కొంతమంది నాయకులు పోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం బీఆర్ఎస్ పార్టీ ఉంటది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం, ఈ ప్రాంతం కోసం పని చేసేపార్టీ. అసలు రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్నాడా..? ఉద్యమంలో జై తెలంగాణ అనలేదు. ఇప్పుడు కూడా అనడం లేదు. కనీసం ఏనాడైనా అమరవీరుల స్థూపం వద్ద రెండు పూలు పెట్టలేదు. తెలంగాణ మీద ప్రేమ లేదు ఆయనకు. తెలంగాణ కోసం పోరాడింది మనం. రాజకీయంగా లబ్ది పొందేందుకు వారు దుష్ప్రచారం చేస్తున్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అడ్డా.. మెదక్ ఎంపీ స్థానంలో ఇప్పుడు కూడా బీఆర్ఎస్ గెలిచి తీరాల్సిందే. తెలంగాణ ఉద్యమం జరిగే సమయంలో పట్టున పది మంది లేకున్నా.. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి.. రానే రాదు కానే కాదు అన్న తెలంగాణ తెచ్చి పెట్టిండు. తెలంగాణ వస్తదంటే ఆ రోజు ఎవరూ నమ్మలేదు.. కానీ కేసీఆర్ తెలంగాణను తెచ్చిపెట్టిండు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

# డిజిటల్ టెక్నాలజీకి పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి..)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు విద్య, వైద్యం, వ్యవసాయం, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, కృత్రిమ మేధ వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. ఆయా రంగాల్లో భారత్ సాధిస్తున్న పురోగతిని బిల్‌గేట్స్‌కు తెలియజేశారు. ఇండియాలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో నూతన సాంకేతికతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు."నేడు డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల అవసరం చాలా ఉంది. డిజిటల్ టెక్నాలజీపై ప్రజలకు అవగాహన పెంచాలి. కృత్రిమ మేధ(ఏఐ) వంటి శక్తివంతమైన సాంకేతికత దుర్వినియోగమయ్యే ప్రమాదం పొంచి ఉంది. నైపుణ్యం లేని వ్యక్తుల చేతుల్లో ఇలాంటి టెక్నాలజీ పడితే దుష్పరిణామాలు తప్పవు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి. నియమ నిబంధనలు అమలు చేయాలి. ఏఐతో సృష్టించే కంటెంట్‌లో వాటర్‌మార్క్‌ను జోడించాలి. ఏఐతో సృష్టించే డీప్‌ఫేక్‌ల విషయంలో అప్రమత్తత అవసరం. ఏఐని అన్నీ సాధించిపెట్టే మంత్ర దండంగా చూడొద్దు. అంటే కృత్రిమ మేధ విలువను తగ్గించడం నా ఉద్దేశం కాదు. గత ఏడాది జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ఏఐని నేను ఉపయోగించుకున్నా. పలు కార్యక్రమాల్లో నా ప్రసంగాలను వేర్వేరు భాషల్లో ప్రసారం చేయడానికి టెక్నాలజీ తోడ్పడింది.

# బిఆర్ఎస్ నుంచి చెత్త వీడుతోంది

- పదవులకోసమే గతంలో పార్టీలో చేరారు
- మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే
- మండిపడ్డ మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి
- పార్టీ వీడిని వారికి కర్రుకాల్చి వాతపెడతారన్న దాసోజు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి29:**

బీఆర్ఎస్ పార్టీని వీడి పలువురు ఇతర పార్టీల్లో చేరడంపై మాజీ శాసన సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి చెత్తాఅంతా పోయింది. గట్టి వాళ్లు మాత్రమే మిగిలారని పేర్కొన్నారు. పదవులు, వ్యాపారాల కోసం వచ్చిన వారే పార్టీ మారుతు న్నారని విమర్శించారు. మోసకారుల జాబితా రాస్తే తొలిపేరు బీబీ పాటిల్‌దే ఉంటుందన్నారు. తొలినుంచి గులాబీ జెండా మోసిన నాయకులే పార్టీలో ఉన్నారని చెప్పారు. ఎంపీ ఎన్నికల తర్వాత బండ్లు ఓడలు, ఓడలు బండ్లవుతాయని చెప్పారు. ఎవరు పార్టీని వీడిన వచ్చే నష్టం లేదన్నారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ పార్టీకి సీనియర్లు రాజీనామా చేసి వెళ్లడం పట్ల దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లం దగ్గరకు ఈగలు పోయినట్టుగా.. నీళ్లు వస్తే కప్పలు చేరినట్టుగా ఇవాళ అధికారంలోకి రావడంతో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి వెళున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని వదిలేసి కాంగ్రెస్ మత్తడిలోకి దూకుతున్నారని చెప్పారు. పార్టీని వీడుతున్న సమయంలో వాళ్లందరూ ఆత్మగౌరవం గురించి మాట్లాడటం బాధగా ఉందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నాడు కే కేశవరావు కుమారుడు విప్లవ్ కుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నన్ని రోజులు వీళ్ళెవరికీ ఆత్మగౌరవం గుర్తు రాలేదని దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అధికారం పోయిన మూణ్నెళ్లలోనే చాలామంది నేతలు ఆగమాగమవుతూ సాకులు చెబుతూ పార్టీని వీడుతున్నారని అన్నారు. ఆత్మగౌరవం దెబ్బతిన్నదని.. అపాయింట్‌మెంట్లు ఇవ్వడం లేదంటూ బీఆర్ఎస్ పార్టీపై దాడి చేసేందుకు దుర్మార్గపు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గ కార్లలో తిరిగి.. పదేండ్లు అధికారంతో వచ్చిన హోదా, డబ్బు, అధికారాన్ని అన్ని రకాలుగా వాడుకుని దాటవేత ధోరణికి పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి కూడా ఆత్మగౌరవం అంశాన్ని లేవనెత్తని మీరు.. అధికారం పోగానే ఆత్మగౌరవం అనే ప్రశ్న పట్టుకురావడం ఎంతవరకు సమంజసమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. ఇది వాళ్ల అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. దివాంచీ బార్ దగ్గర బీడీలు అమ్ముకునేటోడు అని దానం నాగేందర్‌ను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అంతకంటే ఆత్మగౌరవాన్ని కించపరిచే కామెంట్ ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. బీడీలు అమ్ముకునేందుకు కూడా పనికిరాడు అంటూ అవమానించి.. ఆత్మన్యూనత భావంలోకి నెట్టివేసిన రేవంత్ రెడ్డి పంచన చేరే ప్రయత్నం చేసేటప్పుడు ఆత్మగౌరవం గుర్తురావడం లేదా? అని ప్రశ్నించారు.

' ఒక్కనాడు కూడా కేటీఆర్ నిన్ను బీడీలు అమ్ముకునేటోడు అని అనలేదే.. కేటీఆర్ ఎప్పుడూ నీ భూకబ్జాల గురించి మాట్లాడలేదే.. కేటీఆర్ ఒక్కనాడు కూడా ఏరకంగా అగౌరవపరచినట్టు కనబడలేదే.. కేసీఆర్ అయితే కన్నకొడుకు లెక్క చూసుకున్నడు.. అందుకే కేసీఆర్ నాకు దేవుడు లాంటి వాడు అని నువ్వే అంటుంటవ్.. చుట్టూ ఉన్నవాళ్ల కోసం దేవుడిని వదిలేస్తావా? దేవుడి కోసం దేవుడి దగ్గర ఉంటావా?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌లోకి వచ్చారు.. బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు.. ఇంతకంటే నీచమైన అవకాశవాద రాజకీయం ఇంకోటి ఏదైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. కన్నతండ్రిలా వ్యవహరించిన కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీ వీడటం ఎంతవరకు న్యాయమో నాగేందర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్

వైఎస్సార్ కూడా కాళ్లు మొక్కలేదు.. కానీ అనేకసార్లు కేసీఆర్ కాళ్లు మొక్కిండు.. మరి నిజంగానే కేసీఆర్ అవమాన పరిచేలా వ్యవహరించి ఉంటే.. ఆయన కాళ్లు మొక్కేవాడా? అని ప్రశ్నించారు. దానం నాగేందర్‌తో పాటు కే కేశవరావు, కడియం శ్రీహరిపైనా దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు

వదిలివెళ్లడం ఏంటని ప్రశ్నించారు. ఏ మాత్రం ఇంగితం ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని డిమాండ్ చేశారు. మీకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధమైన దానం నాగేందర్‌పై కూడా దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. అసలు ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఒక దాంట్లో ఓడిపోయినా.. మరొకటి ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు ఉన్నారని అన్నారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై దానికి రాజీనామా చేయకుండా.. మరో పార్టీ నుంచి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే ఆటోమేటిగ్గా అనర్హత వేటు పడుతుందని తెలియజేశారు. ఒకేసారి రెండు పడవల మీద ప్రయాణం చేయాలని అనుకుంటున్నారు.. కానీ రెండింట్లోనూ మునక తప్పదని ఆయన విమర్శించారు. ఖైరతాబాద్ ప్రజలు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమని జోస్యం చెప్పారు.

# మాపై సోషల్ మీడియాలో అవాస్తవాలు

- మేం బిఆర్ఎస్ పార్టీని వీడేది లేదు
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టీకరణ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-మార్చి29:**

ఇవాళ సోషల్ మీడియా ఫ్రీగా ఉంది కాబట్టి ఇష్టమొచ్చినట్లు పుకార్లు సృష్టిస్తున్నారు.. వాళ్లు పార్టీ మారుతున్నారు.. వీళ్లు పార్టీ మారుతున్నారు అని రూమర్స్ వ్యాప్తి చేస్తున్నారు అని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మా జిల్లాలో నా కోసం ఒక మంత్రి పదవికి రిజర్వ్ చేసి పెట్టారట. నా కుమారుడు కార్తీక్ రెడ్డి చెప్పిన మాదిరిగా చివరి శ్వాస వరకు కేసీఆర్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో సబిత పాల్గొని ప్రసంగించారు. తోటి ఎమ్మెల్యేలు చేవెళ్ల చె÷-లలెమ్మ అన్నప్పుడల్లా నా మనసు పులకరించిపోతోంది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం. గత 20 ఏండ్ల నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. ప్రతిపక్షంలో ఉండి ఎలా పోరాటం చేయాలో మీకు అందరికీ తెలుసు. ప్రజల కోసం పని చేయాలి. ఈ ఎన్నికల్లో మన పార్లమెంట్ ఏరియాలో ఏమన్న ఇబ్బంది ఉంటే చెప్పండి.. పరుగెత్తుకువస్తాం. కేసులకు భయపడేది లేదు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న తట్టు తాకింది.. దాంతో వెనక్కి వెళ్లాల్సిన అసవరం లేదు. గట్టిగా పని చేసి కాసానిని గెలిపించి, కేసీఆర్ రుణం తీర్చుకుందాం. విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి ఎవరో మనకు తెలియకపోయినా కేసీఆర్ పంపించారు.. మనం గెలిపించాం. అంతో ఇంతో కాసాని మనతో మమేకమై పని చేస్తూ వస్తున్నారు. ఈ రోజు బడుగుల గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే ఆయనను గెలిపించాలి. కార్యకర్తల శక్తి ఏంటో ఇప్పుడు చూపించాలి. కేసీఆర్ అంటే ఏంటి..? కేసీఆర్ సైన్యం ఏంటో చూపించాలి. మాకు వచ్చిన మెజార్టీ కంటే కాసానికి డబుల్ మెజార్టీ రావాలి. ఇవాళ పార్టీ మారుతున్న వారంతా మానవత్వం లేని వారు అని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వేసవి దృష్ట్యా తాగునీటిని పొదుపుగా వాడాలి

- మంచినీటి సమస్య తలెత్తితే రైతులు బోర్లను లీజ్‌కి ఇవ్వండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** వేసవిని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటిని ప్రతి ఒక్కరు పొదుపుగా వాడాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది కన్నా ఈ ఏడాదిలో 42 డిగ్రీల ఎండ తీవ్రత ఎక్కువైందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో చాలా మటుకు తాగునీటి అవసరాలకు సరిపడెంత త్రాగునీరు లేక కొంత ఇబ్బంది వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో ప్రజలు అందరి బాధ్యతగా స్వీకరించి తాగునీటి అవసరాల కోసం తప్ప ఇతరత్రా అవసరాల కోసం నీటిని వాడొద్దని, మరి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తాగునీటిని ఎక్కువ మటుకు వృధా చేస్తున్నారని , అలా చేయడంవల్ల తాగునీరు అవసరం ఉన్న వాళ్లకు ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. నియోజకవర్గంలోని 7 మండలాలకు ప్రతిరోజు వినియోగించే నీటి సరఫరాకు సంబంధించిన వివరాలను పూర్తిగా అధ్యయనం చేయడంతో అధికారులు రెడ్ క్యాటగిరిగా, ఎల్లో కేటగిరిగా, ఆరంజ్ క్యాటగిరిగా విభజించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 219 హ్యాబిటేషన్ ద్వారా 25వేల 40 కిలో లీటర్లను సరఫరా చేయాల్సి ఉండగా, 19,439 కిలో లీటర్లను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పెబ్బేరు మండలంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, తాగునీటిని పొదుపుగా వాడుకుంటే వేసవికాలం మొత్తం ఇబ్బందులకు అంతగా తావుండదన్నారు. అవసరానికి మించి ఇతర వాటికి తాగునీటిని ఉపయోగిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, రాష్ట్ర మైనార్టీ నాయకులు కమ్మర్ మియా, కాంగ్రెస్ నాయకులు నందిమల్ల యాదయ్య, టౌన్ మాజీ అధ్యక్షుడు కిరణ్ కుమార్, చంద్రమౌళి, ఎండి బాబా, రాగి వేణు, వేనా చారి, తదితరులు పాల్గొన్నారు.



# హునర్ మహోత్సవ ఎగ్జిబిషన్ ప్రారంభం

- హునర్ చైర్మన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సహకారంతో ఏర్పాటు
- దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చేనేత, చేతివృత్తుల కళాకారులకు చేయూత
- బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ప్రారంభం

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్:** దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చేనేత, చేతివృత్తుల కళాకారులు ఉత్పత్తి చేసిన వస్తువులను ఒకే చోట చేర్చుకొని ప్రదర్శించి అమ్ముకొని ఆర్థికంగా బలపడేందుకు హునర్ మహోత్సవ ఎగ్జిబిషన్ చైర్మన్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందని, కంటోన్మెంట్ బోర్డ్ సీఈవో మధుకర్ నాయక్ అన్నారు. జింఖానా గ్రౌండ్ లో శుక్రవారం సాయంత్రం హునర్ మహోత్సవ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది . ఈ ఎగ్జిబిషన్ ని కంటోన్మెంట్ సీఈవో మధుకర్ నాయక్ ప్రారంభించారు .ఈ సందర్భంగా స్టాల్స్ లో ఉన్న బట్టలను మోడల్స్ చిత్రకళను వివిధ రకాలైన వస్తువులను తిలకించి ఆయన ఎంతో కళాకారుల ప్రతిభను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తయారు చేసే వస్తువులు వారికి మార్కెటింగ్ సౌకర్యం లేక సేల్స్ లేక ఇబ్బంది పడతారని అందుగ్గాను ఇలాంటి ప్రదర్శన ఏర్పాటు చేయడం వల్ల కొనుగోలుదారులకు అందుబాటులో ఉండి వ్యాపార అభివృద్ధి చెంది అవకాశం ఉంటుందని ఉత్పత్తిదారులకు సహకారం అందించే ఇలాంటి కార్యక్రమానికి ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరి పైన ఉన్నదని ఆయన అన్నారు .గాంధీ స్మృతి అండ్ దర్శన్ సమితి ఆధ్వర్యంలో హునర్ మహోత్సవం ఏప్రిల్ నెల 8వ తేదీ వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని ఈ ప్రదర్శనలో ఆధునిక వస్త్ర పరికరాలు రూపకరణాలు చిన్నపిల్లల నుంచి గృహిణులకు మోడలింగ్ డ్రెస్సులు శారీలు అందుబాటులో ఉండేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారనీ, అన్నారు. నిర్వాహకులు దీపక్ శుక్ల తదితరులు పాల్గొన్నారు.



## గుడ్ ఫ్రైడే సెలబ్రేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్ న్యూస్) -మార్చి 29:** మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో పరిశుద్ధాత్మ అగ్ని మినిస్ట్రీస్ చర్చ్ నందు. గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు గౌ,, శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక ప్రార్ధనల అనంతరం మాట్లాడుతూ ఈ గుడ్ ఫ్రైడే రోజు ఇలా మీ అందరితో కలిసి ప్రార్ధనలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మరియు బి.యల్.అర్ బ్రదర్స్ పాల్గొన్నారు.





# బుద్ధారం ధర్మతాండలో బిఆర్ఎస్‌కు బై బై.. కాంగ్రెస్‌కు జై జై..

## కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:** గోపాల్ పేట మండలం బుద్ధారం ధర్మతండాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి బై బై చెప్పి కాంగ్రెస్ కు జై జై కొట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, ఏఐసిసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్య రెడ్డి లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్దే ధ్యేయంగా 6 గ్యారంటీలు అమలు చేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు బాసటగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ గోపాల్పేట మండల జనరల్ సెక్రెటరీ జిల్లెల ప్రవీణ్ రెడ్డి, నాయకులు రవీందర్, రాజేందర్ ఉపసర్పంచ్ బద్రు, నర్సింగు, సక్రు, హనుమంతు, వెంకటయ్య, బోడ జైపాల్, శ్రీను ఆంజనేయులు తదితరులు పార్టీలో చేరారు.



## కుటుంబ కలహాలతో రైతు ఉరివేసుకొని మృతి

**ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రతినిధి (నేటి ఫోకస్‌న్యూస్)-చారగొండ వెంకటేష్ మార్చి 29:** కుటుంబ సలహాలతో రైతు తన వ్యవసాయ పొలంలో ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన అచ్చంపేట మండల పరిధిలో దుబ్బ తండాలో చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన అచ్చంపేట ఎయస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గురువారం అచ్చంపేట మండలం దుబ్బ తండ గ్రామానికి చెందిన కేతావత్ జోహార్ 33 అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో తన వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభానికి తాడుతో ఉరివేసుకొని మృతి చెందాడని మృతుడి భార్య కవిత తెలిపారని ఎస్ఐ తెలిపారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# నూతన బిఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం







- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు

**మిర్యాలగూడ (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 29:** మిర్యాలగూడ నియోజక వర్గ బి.అర్.యస్ పార్టీ కార్యాలయాన్ని మిర్యాలగూడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శ్రీ. నల్లమోతు భాస్కర్ రావు నియోజక వర్గ బి.అర్.యస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంబించారు. ముందు పూజారి వారికి స్వాగతం పలికి ప్రధమ ద్వారం వద్ద పూజలు చేయించారు. ఇట్టి కార్యక్రమానికి నల్లగొండ పార్లమెంట్ నియోజక వర్గ బి.అర్.యస్ పార్టీ అభ్యర్ధి కంచర్ల కృష్ణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీ. నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలెవ్వరు అధైర్య పడవద్దని అందరి కష్ట సుఖాల్లో భాగస్వాముడై ఎవరికైనా ఎటువంటి ఇబ్బంది వచ్చిన బి.అర్.యస్ పార్టీ నేను అండగా ఉంటానని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన, దాడుల పాలన నేడు తెలంగాణ రాష్ట్రములో నడుస్తుందని ప్రజలు ఇటువంటి చర్యలను హర్షించరని తెలిపారు. నేటి నుంచి మిర్యాలగూడ నియోజక వర్గ ప్రజలకు పార్టీ కార్యాలయానికి నేరుగా రావొచ్చని తెలిపారు. కార్యక్రమములో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, తిప్పన విజయసింహ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ తిరుణగారు భార్గవ్, డీ.సీ.ఎం.స్ ఛైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, నల్లగొండ జిల్లా మాజీ రాశితు బంధు అధ్యక్షులు చింతారెడ్డి శ్రీనివాస రెడ్డి, జడ్పీ కొ ఆప్షన్ మెంబర్ మోషీన్ అలీ, మిర్యాలగూడ నియోజక వర్గ యువనాయకులు నల్లమోతు సిద్ధార్ధ, మాజీ ఏ.యమ్.సి ఛైర్మన్ లు ధనవత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, జిల్లా మాజీ రైతు సంఘం అధ్యక్షులు నామిరెడ్డి యాదగిరి రెడ్డి, ఏ.యమ్.సి మాజీ వైస్ ఛైర్మన్ కుందూరు వీరకోటి రెడ్డి, బి.అర్.యస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నాభిమోజు నాగార్జున చారి, నల్లగొండ మాజీ మున్సిపల్ ఛైర్మన్ మందడి సైది రెడ్డి, ఎంపీపీ లు బాలాజీ నాయక్, జడ్పీటీసీ లు అంగోతు లలిత హాతీరాం నాయక్, కుర్ర సేవ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు మట్టపల్లి సైదయ్య యాదవ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య, బి.అర్.యస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ గౌడ్, అధికార ప్రతినిధి పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, నాయకులు చౌగాని బిక్షం గౌడ్, పాశం నరసింహ రెడ్డి, ఎలాకాని రమణ, బారెడ్డి అశోక్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పెండ్యామ్ పద్మ, కార్యదర్శి కోదాటి రమా, పేరుమాళ్ళ రాఖీ, నాగలక్ష్మి, సైదులు రెడ్డి, అమరావతి సైదులు, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇంచార్జ్ లు, నవీన్ రెడ్డి, శ్యామ్, రాజగోపాల్ రావు, సోము సైది రెడ్డి, కట్టా మల్లేష్ గౌడ్, మన్నెం లింగా రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాచ్చు నాయక్, కుర్ర శ్రీను, సైదా నాయక్, సచిన్ నాయక్, ప్రకాష్ నాయక్, వెంకన్న, సురేష్, ఏల్లుబెల్లి నాగరాజు, శహనాజ్ బేగం, షోయబ్, లచ్చు నాయక్, పల్లా బిక్షం, ఇస్లావాత్ బాలు నాయక్, సుబ్బా రావు, పద్మయ్య, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, భూక్యా మంజ నాయక్, మిరియాల మధుసూదన్, మాతంగి రవి, భవనగిరి దేవేందర్, జానకి రెడ్డి, బాల సత్యనారాయణ, కాంచారకుంట్ల దయాకర్ రెడ్డి, కె.డి.పి, కొందారపు బ్రదర్స్, అశోక్, దస్రు, ఎంపీటీసీ కొర్ర కాంతి కృష్ణా కాంత్, కునాల గోపాల కృష్ణ,నాగులు, బంటు రమేష్, దేంద నరసింహ, డీవీపీ సుబ్బా రావు, లావుడి చావులి, బానావత్ లలిత, బాలు, వీర, ఆంజనేయులు, గోవిందు, బి.అర్.యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలుస్తాం

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్:** మల్కాజ్ గిరి పార్లమెంట్ లో బిజెపి జెండా ఎగడం ఖాయమని, మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని అవుతారని, మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మల్కా కొమురయ్య బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈటెల రాజేందర్ మాట్లాడుతూ.... మల్కాజ్ గిరిలో నిర్వహించిన మోడీ రోడ్ షోలో మోడీనీ ఎట్ల ప్రజల ప్రేమ బంధించిందో ఆయన అనేక సభలో చెప్పాడు. మల్కాజ్గిరి ప్రజలను చూసి ముగ్ధుడై అయినా మోడీ, మల్కాజ్గిరి లో బిజెపి అభ్యర్థి గెలవడం ఖాయమని అనేక సభలలో వెల్లడించిన వెల్లడించారు. తెలంగాణలో 12 పార్లమెంటు సీట్లు గెలుస్తాయని మోడీ తెలిపారు. మల్కాజ్ గిరిలో నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని తను గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. మల్కాజ్ గిరి పార్లమెంటులో సర్వేలకు అందని విధంగా బిజెపి పార్టీ ఘన విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ వివిధ సంఘాల నాయకులు ముక్కుమడిగా ఈటల రాజేందర్‌కు మద్దతు ఇస్తున్నారని ఆయన తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి నియోజకవర్గన్ని ఏమి అభివృద్ధి చేయలేదని, జిహెచ్ఎంసి ఎన్నికలలో, అసెంబ్లీ ఎన్నికలలో కూడా ఒక్క సీటు గెలవలేదని హెద్దేవా చేశారు. బిజెపి పార్టీ కోసం, ఈటెల రాజేందర్ కోసం శ్రమిస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు టీం సాయి, మల్క యశశ్విని, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మహావీర్ జయంతి వేడుకలకు సీఎం రేవంత్‌కి ఆహ్వానం


**– రేవంత్‌ని మర్యాదపూర్వకం కలిసిన కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్**

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్:** కంటోన్మెంట్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీగణేష్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర జైన్స్ అధ్యక్షులు యోగేష్ జైన్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినీ తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ... నాంపల్లి గ్రౌండ్లో జరగబోయే మహావీర్ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొనాల్సిందిగా ఆహ్వానించడం జరిగిందాని, ముఖ్యమంత్రి యువత రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాష్ జైన్, కోశాధికారి మహేందర్ జైన్, ప్రధాన కార్యదర్శి అశోక్ జైన్, కంటోన్మెంట్ జైన్ సంఘం అధ్యక్షులు ప్రవీణ్ జైన్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు పాల్గొన్నారు.

## బిఎల్ఎ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలి


**– పిసిసి నెంబర్ వల్లబు రెడ్డి**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చ్ 29:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పిలుపు మేరకు బి ఎల్ ఎ కార్యక్రమంనీ నిర్వహిస్తున్నట్లు పిసిసి మెంబర్ పుల్లబు రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల నేపథ్యంలో నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ లకు ఒకరోజు శిక్షణ శిబిరాన్ని వెలమ ఫంక్షన్ హాల్ లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ జాతీయ సమన్వయకర్త కొప్పుల రాజు ,ఏఐసిసి ట్రైనింగ్ ఇంచార్జ్ రోహిత్ చౌదరి ,ఏఐసీసీ ట్రైనింగ్ మెంబర్ జైన్, టిపిసిసివార్ రూం చైర్మన్ పవన్ మల్లాడి హాజరవుతారు. అదేవిధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి , పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, డాక్టర్ వంశీకృష్ణ, ఎంఎల్‌సి కూచుకుల్ల దామోదర్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని కావున బిఎల్ఎ శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు నాయకులు పాపిరెడ్డి, కృష్ణారెడ్డి, తైలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా టీడీపీ ఆవిర్బవ దినోత్సవం

**మిర్యాలగూడ, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 29:** తెలుగుదేశం కార్యాలయంలో తెలుగుదేశం పార్టీని స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించి నేటికి 42సంవత్సరా ల ఆవిర్బవ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. జాతీయ పార్టీ క్రమశిక్షణ సభ్యు లు నియోజకవర్గం ఇంచార్జి బంటు వెంకటేశ్వర్లు పార్టీ పతకాన్ని ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ 42ఏండ్ల వెనుక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామ్య ముఅపహాస్యం అయి, పేద వారు జీవించే వనరులు ఆహార భద్రత లేక దుర్భర పరిస్థితు ల లో ఎన్టీఆర్ కూడు గూడు, గుడ్డ నినాదం తో పార్టీ ని స్థాపించిప్రజల కు న్యాయం చేసిన పార్టీ అధికారం వున్నా లేకున్నా ప్రజ సమస్యల కై ముందుకు వెళుతుంది అన్నారు. పట్టణ పార్టీ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు నసీరొద్దీన్ బాబా, మండల పార్టీ కన్వీనర్ చిలకల వెంకన్న, రాష్ట్ర వాణిజ్య సెల్ ఉపాధ్యక్షులు ఏచూరి అనంతరాములు, పార్లమెంట్ బీ.సీ సెల్ అధ్యక్షులు చవల వెంకటేశ్వర్లు, గర్దాస్ ప్రభాకర్, గంధం సత్యనారాయణ, దాసోజు కాంత చారి, సజ్జల వెంకటరెడ్డి, నవీన్, శోభన్ పాల్గొన్నారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌కు బీజేపీ సన్మానం

**తొర్రూర్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 29:** భారత ప్రభుత్వం చే నియమింపబడిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియామకం అయిన మానుకోట ముద్దు బిడ్డ జాటోత్ హుస్సేన్ నాయక్ గారిని ఈరోజు బీజేపీ తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో తొర్రూరు మండల బీజేపీ శ్రేణులు ఘన సన్మానం చేయడం జరిగింది.జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులుగా నియామకం అయిన తర్వాత మొదటి సారి మానుకోట జిల్లా కు విచ్చేస్తున్న సందర్భంగా ఈరోజు మానుకోట నందనా గార్డెన్స్ లో పౌర సన్మానం ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వస్తున్న సందర్భంగా తొర్రూరు పట్టణంలోని స్థానిక గెస్ట్ హౌస్ సెంటర్ వద్ద హుస్సేన్ నాయక్ గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించడం జరిగింది.ఈ సన్మాన కార్యక్రమం లో బీజేపీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు రంగు రాములు, బీజేపీ పెదవంగర మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన సుధాకర్, బీజేపీ అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య,ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపురం రాజకుమార్, అర్బన్ మండల ఉపాధ్యక్షులు గడల శేఖర్,గట్ల భరత్,విజయ్ కుమార్, కార్యదర్శులు జలగం రవి,గంధం రాజు,యువ మోర్చా అర్బన్ అధ్యక్షుడు కాగు నవీన్, ప్రధాన కార్యదర్శి నూకల నవీన్, సోషల్ మీడియా కన్వీనర్లు శివ,భాస్కరా చారి,బూత్ కమిటీ అధ్యక్షులు శ్రీనాథ్, శ్రీనివాస్ చారి, నడిగడ్డ సందీప్,ధరావత్ సురేష్, నాగేష్ నాయక్, రూల్ మండలం ఉపాధ్యక్షులు విష్ణు వర్ధన్ చారి,ఓబీసీ మోర్చాజిల్లా ఉపాధ్యక్షులు,గట్టు రాంబాబు, మరియు గండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# టిల్లు స్క్వేర్ తరహాలో డీజే టిల్లు

# లిప్‌లాక్‌లతో కట్టిపడేసిన అనుపమ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వర్ జంటగా నటించిన రొమాంటిక్ క్రైమ్ కామెడీ టిల్లు స్క్వేర్. 'డీజే టిల్లు' చిత్రంతో ఒక్కసారిగా సినీప్రియుల్లో భారీ క్రేజ్ సంపాదించుకున్నాడు సిద్ధు జొన్నలగడ్డ. ఆ సినిమాలో టిల్లుగా అతడు చేసిన అల్లరి అందర్నీ కడుపుబ్బా నవ్వించింది. దీంతో ఇప్పుడా పాత్రతో మరోమారు థియేటర్లలో నవ్వులు పూయించేందుకు 'టిల్లు స్క్వేర్' వచ్చేశాడు. ఈసారి ఇందులో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. టీజర్, ట్రైలర్లలో చూపించిన కంటెంట్ 'డీజే టిల్లు' తరహాలోనే వినోదాత్మకంగా ఉండటం.. విడుదలకు ముందే పాటలు కూడా మంచి ఆదరణ దక్కించుకోవడంతో అందరి దృష్టి ఈ సీక్వెల్‌పైనా పడింది. రాధిక (నేహాశెట్టి)తో పాత పంచాయితీ ముగిశాక టిల్లు (సిద్ధు జొన్నలగడ్డ) సొంతంగా ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రారంభిస్తాడు. పాత గొడవలన్నీ మర్చిపోయి మళ్లీ తనదైన శైలిలో సరదాగా జీవితాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తుంటాడు. సరిగ్గా అప్పుడే అతని జీవితంలోకి లిల్లీ (అనుపమ పరమేశ్వరన్) అనే మరో అందమైన అమ్మాయి ప్రవేశిస్తుంది. వాళ్లిద్దరూ అనుకోకుండా ఓ పబ్‌లో కలుసుకుంటారు. ముందు టిల్లు ఆమెతో మాట కలుపుతాడు. అతడి మాటలు.. వ్యవహారశైలి నచ్చి ఆమె తనతో పెదవి కలుపుతుంది. అంతే.. అదే రాత్రి ఇద్దరూ ఒక్కటవుతారు. కట్ చేస్తే తెల్లారేసరికి గదిలో ఒక లెటర్ పెట్టి లిల్లీ అక్కడ్నుంచి వెళ్లిపోతుంది. కానీ, ఆ ఒక్క పూటలోనే ఆమెను మనసంతా నింపేసుకున్న టిల్లు ఆ ఆలోచనలతో పిచ్చివాడైపోతాడు. ఆమెను వెతికి పట్టుకోవడం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తాడు. ఈ క్రమంలో నెల తర్వాత లిల్లీ ఓ ఆస్పత్రిలో టిల్లుకు ఎదురుపడుతుంది. తను గర్భవతినని చెప్పడంతో టిల్లు షాకవుతాడు. ఆ తర్వాత తనని పెళ్లి చేసుకుంటానని చెప్పి ఇంటికి తీసుకొస్తాడు. ఈలోపు మళ్లీ టిల్లు పుట్టినరోజు వస్తుంది. ఆరోజు లిల్లీ అతన్ని తన అపార్ట్‌మెంట్‌కు రావాలని కోరడంతో తను అక్కడికి వెళ్తాడు. తీరా చూస్తే అది రాధిక (నేహా శెట్టి) ఫ్లాట్. మరి అక్కడికి వెళ్లాక టిల్లుకు ఎదురైన సమస్య ఏంటి? రాధిక, లిల్లీకి మధ్య ఉన్న సంబంధం ఏంటి? దుబాయ్ నుంచి వస్తున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ షేక్ మహబూబ్ (మురళీశర్మ)కు ఈ కథకు ఉన్న లింకేంటి? అతన్ని చంపాల్సిన మిషన్‌లోకి టిల్లు ఎందుకొచ్చాడు? అన్నది మిగతా కథ. సీక్వెల్ కథ కూడా తొలి భాగం తరహాలోనే సింపుల్ లైన్‌లో సాగిపోతుంది. కాకపోతే మరోసారి టిల్లు పాత్రే ఆ సాధారణమైన కథను అసాధారణమైన నటనతో అద్భుతంగా నిలబెట్టేసింది.లిల్లీ పాత్ర పరిచయ సన్నివేశాలు.. టిల్లు ఠక్కున ఆమె మాయలో పడిపోవడం.. ఒక్క రాత్రిలోనే ఇద్దరూ ఒక్కటవ్వడం.. ఇలా అంతా రాధిక ఎపిసోడ్ మరోసారి లిల్లీ వెర్షన్‌లో పునరావృతమవుతున్నట్లు అనిపిస్తుంది. ఇక టిల్లు తన బర్త్‌డే పార్టీని వదిలేసి లిల్లీని వెతుక్కుంటూ పాత రాధిక అపార్ట్‌మెంట్‌కే వెళ్లడం.. ఆరోజు చేదు జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ మళ్లీ అదే సమస్యలోకి దిగడం ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత నుంచే ఈ కథలో కొత్త కోణం బయటకొస్తుంది. నిజానికి ఈ మధ్యలో సాగే తతంగమంతా కొందరికి పాత కథను మళ్లీ చూస్తున్నామన్న అనుభూతి కలిగించినా టిల్లు పాత్ర చేసే అల్లరితో అదంతా కొట్టుకుపోతుంది. ఇక ద్వితీయార్థం షేక్ మహబూబ్ అలీని పట్టుకునే మిషన్ నేపథ్యంలో సాగుతుంది. అంత పెద్ద క్రిమినల్‌ను చంపడానికి టిల్లు లాంటి సాధారణ వ్యక్తితో ఎలాంటి సాహసాలు చేయిస్తారన్న ఆసక్తి అందరిలోనూ కలుగుతుంది. నిజానికి ఆ ప్రయత్నం మరీ అంత థ్రిల్లింగ్‌గా సాగకున్నా ఎక్కడా బోర్ కొట్టించదు. టిల్లు పాత్రలో సిద్ధు జొన్నలగడ్డ తనదైన నటనతో మరోసారి కట్టిపడేశాడు. లిల్లీ పాత్రలో అనుపమ తెరపై చాలా హాట్‌గా కనిపించింది.






# ప్రతినిధి-2గా నారా రోహిత్..

దాదాపు ఆర పుష్కరం తర్వాత నారా రోహిత్ నటిస్తున్న చిత్రం ప్రతినిధి-2. 2014లో విడుదలై ఓ కల్ట్ చిత్రంగా పేరు దక్కించుకున్న ప్రతినిధి సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతోండగా ప్రముఖ జర్నలిస్టు మూర్తి ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. తాజాగా ఈ చిత్రం టీజర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు. అప్పటి ప్రతినిధి సినిమా స్టైల్‌లోనే ఈ సినిమా కూడా ఆద్యంతం ఔట్ అండ్ ఔట్ పొలిటికల్ థ్రిల్లర్ కథాంశంతోనే సమకాలీన రాజకీయాలపై సైటైర్లు వేస్తూ సాగనుంది. సినిమాలో దాదాపు అంతా సచిన్ ఖేడేకర్, జిష్ణు సేన్‌గుప్తా, రఘుబాబు, పృథ్వీ, అజయ్ ఘోష్, శ్రీకాంత్ అయ్యంగార్ వంటి పేరున్న నటులు నటిస్తుండడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెంచేస్తున్నాయి. మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. ముఖ్యంగా.. సినిమాలోని జనం కోసం బతికితే చచ్చాక కూడా బతికే ఉంటాం, ఓటు వేయండి.. లేదంటే ఈ దేశం వదిలి వెళ్ళిపోండి.. అది.. కుదరకపోతే చచ్చిపోండి.! వంటి డైలాగ్స్ అలోచింపజేసే విధంగా ఉన్నాయి.




# వరుస సినిమాలతో బిజీగా సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ప్రస్తుతం శివ దర్శకత్వంలో కంగువ సినిమా చేస్తుండగా.. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. కాగా మరోవైపు ఆకాశం నీ హద్దురా ఫేమ్ సుధా కొంగరతో సూర్య43కి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. దీనికి సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. కాగా ఈ రెండు ప్రాజెక్టులు లైన్‌లో ఉండగానే తమిళ సూపర్ స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు తో సూర్య 44 సినిమా చేసేందుకు ఓకే చెప్పాడు సూర్య. తాజాగా ఈ ఇంట్రెస్టింగ్ సినిమాకు సంబంధించిన కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది. ఈ మూవీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అశోక్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు తక్కువ సమయంలోనే ఓకే అయింది. ఈ మూవీ షూటింగ్ త్వరలోనే షురూ కానుంది. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులను కార్తీక్ సుబ్బరాజు ÷నైల్ చేస్తారని చెప్పారు. అంతేకాదు తాజా టాక్ ప్రకారం సూర్య 44 మల్టీస్టారర్‌గా వచ్చే అవకాశాలున్నాయి. సినిమా స్లాట్‌ను కార్తీక్ సుబ్బరాజు ఇప్పటికే సిద్దం చేశాడట. ఈ చిత్రాన్ని 2025 పొంగల్ కానుకగా విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నట్టు ఇన్‌సైడ్ టాక్. సూర్య 44 ఏ జోనర్‌లో రాబోతుందనే దానిపై రాబోయే రోజుల్లో క్లారిటీ రానుందని సమాచారం. సూర్య44 సినిమాను సూర్య హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నట్టు సమాచారం. మరోవైపు ఇప్పటికే లాంఛ్ చేసిన కంగువ గ్లింప్స్ వీడియో, పోస్టర్లు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. సూర్య, బాబీడియోల్ పోటీ పడి మరీ తమలోని కొత్త యాంగిల్‌ను పరిచయం చేయబోతున్నట్టు గూస్ బంప్స్ తెప్పించే యాక్షన్ సన్నివేశాలతో క్లారిటీ ఇచ్చేశాడు డైరెక్టర్.



# మరో సినిమాకు సైన్ చేసిన విశ్వక్‌సేన్..

టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ఒకటి విశ్వక్ సేన్ 10. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్నాడు. విశ్వక్‌సేన్ చేతిలో పానను పట్టుకొని పైకి చూపిస్తున్న స్టిల్‌తో ఇప్పటికే అప్‌డేట్ అందించారు మేకర్స్. శుక్రవారం విశ్వక్ సేన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మూవీకి మెకానిక్ రాకీ టైటిల్‌ను ఫైనల్ చేశారు. తాజా టైటిల్ లుక్ చూస్తుంటే మాస్ కా దాస్ తనలోని ఫన్ యాంగిల్‌తో ఈ సారి బాక్సాఫీస్ గట్టిగానే దండయాత్ర చేసేందుకు రెడీ అవుతున్నట్టు అర్థమవుతోందంటున్నా రు సినీ జనాలు. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. హై ఫోర్స్ ఇంజిన్ త్వరలోనే షురూ అవుతుంది..ఫన్ రైడ్ కోసం రెడీగా ఉండండి.. అంటూ రిలీజ్ చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తల్లూరి నిర్మిస్తుండగా.. జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. విశ్వక్ సేన్ దీంతోపాటు ఫల్ మోహన్ రంగ ఫేం కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ 11వ సినిమాగా వస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి లో నటిస్తు న్నాడు. ఈ ప్రాజెక్ట్‌ను శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార సంస్థ బ్యానర్‌తో కలిసి ఫార్ఛ్యూన్ ఫోర్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. నేహా శెట్టి, అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. మరోవైపు రామ్ నారాయణ్ దర్శకత్వంలో 12 చిత్రంలో నటిస్తున్నాడు.

